
# అనుబంధం




అత్తిలి వెంకటరత్నం

"ఏమండీ"

రమణ యేమిటన్నట్లుగా చూసాడు భార్య వైపు.

"మా నాన్నవచ్చారు."

"ఎప్పుడు? నాకు కనబడలేదేం?" రమణ షర్టు విప్పి స్టాండుమీద పడేసాడు.

"మధ్యాహ్నం. ఇప్పటివరకూ మీరు వస్తారని ఎదురు చూసి యిప్పుడే అలాగ ఎక్కడికో వెళ్లారు."

"ఏమిటి విశేషం?" రమణ, సరోజ చేతిలోని కాఫీగ్లాసు అందుకున్నాడు. సరోజ యేమీ జవాబు చెప్పలేదు. రమణ కొంచెం కాఫీ రుచి చూసి బల్ల మీద పెట్టేసాడు.

"అబ్బ! చేదు సరూ! కొంచెం పంచదార తీసికొనిరా" రమణ విసుగ్గా అన్నాడు.

"అయిపోయిందండి." సరోజ బాధగా అంది.

"మరి ముందే చెప్పి యేడవకూడదూ? తెచ్చి పడెయ్యడానికి ఉన్నాగా" చికాకుగా అన్నాడు.

"మరి నాకేంతెలుసు! నిన్న అత్తగారిని అడిగితే ఉందన్నారు." సరోజ చిన్నబుచ్చుకుని అంది.

రమణ ఒక్క గ్రుక్కలో కాఫీ త్రాగేసి బల్ల మీద పెట్టేసాడు గ్లాసు.

"ఉత్తరా లేమయినా వచ్చాయా?"

"వూఁ. దుర్గ దగ్గరనుంచి. వాళ్ళ మామ గారు వ్రాసారు"

"ఏం వ్రాసారేమిటి?"

"వాళ్ళ అబ్బాయికి దిగబెట్టడానికి సెలవు లేదుట. కాబట్టి యేడవనెల దాటకుండా మీరు ఎవరయినా వచ్చి తీసికొని వెళ్ళమని వ్రాసాం."

"ఇక్కడెవరికో తీరిక పడి చస్తున్నట్టు! యిప్పుడు తను వెళ్ళి రావాలంటే కనీసం యేభయి రూపాయలేనా ఉండాలి. ఎక్కడి నుంచి తేవాలి?" రమణకి ఒళ్ళు మండింది.

"అమ్మా! యేమిటా ఉత్తరం? వాళ్ళకి అంత తీరిక లేకపోతే అక్కడే పురుడు పోసుకోమని వ్రాస్తాను" రమణ కోపంగా వంట గదిలోకి అడుగు పెట్టాడు.

గది అంతా పొగతో నిండి యేమీ కనబడటం లేదు. రమణ అడుగు వెనక్కి వేసాడు.

"ఏమిట్రా!" సీతమ్మ బయటికి వచ్చింది వంట గదిలో నుంచి.

"అమ్మా"! రమణ యేదో కోపంగా అనబోయి ఆగిపోయాడు. సీతమ్మ కళ్ళు రెండూ పొగతో నిండి నీళ్ళు కారుతున్నాయి. ముక్కు ఎర్రబడి పోయింది. తల వెంట్రుకలనిండా బూడిద!

"నీళ్ళు కాగాయా? స్నానం చేయాలి!" రమణ దిగజారిపోయి అన్నాడు.

"ముందే పెట్టానురా. పచ్చి కట్టెలేమో మండి చావడంలేదు. రెండు నిముషాలు కూర్చో. కాగిపోతాయి" ఆవిడ మళ్ళీ వంటగదిలోకి వెళ్ళి పోయింది.

"సరూ! నాన్న యింకా ప్రయివేట్లనుంచి యింటికి రాలేదా యేమిటి?" రమణ భార్యతో అన్నాడు.

సరోజ లేదన్నట్లుగా తలవూపింది.

"అన్నట్టు, మురళీ యేడీ? ఒకసారి పిలు. సైకిలు పంక్చరయింది. బాగు చేయించాలి. లేక పోతే రేపు ఖర్మమా అని నడచి వెళ్ళాలి."

"యింట్లో లేడు." సరోజ అంది.

"ఒక్కడికీ బాధ్యత తెలియదు. ఏమీ పట్టదు" రమణ నీరసంగా కుర్చీలో వ్రాలాడు. సరోజ గదిలో చిందరవందర సామాన్లన్నీ సర్దుతూ నిలుచుంది. రమణ యెటోచూస్తూ ఉండిపోయాడు. కనుబొమలు ఆలోచిస్తున్నట్టుగా మెలికలు తిరిగాయి. సరోజ మధ్య మధ్యలో ఆగి భర్త ముఖం లోకి చూస్తూ ఉండిపోయింది.

రమణ భార్యవంక చూసి పాడిగా నవ్వాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" సరోజ దగ్గరగా వస్తూ అంది.

"క్రొత్తగా మరొకటేముంది? రేపెలాగ గడుస్తుందా అని" రమణ చికాకుగా అన్నాడు.

"అనవసరంగా మీ మనసు పాడు చేసుకోకండి. అన్నీ అవే చక్కబడతాయి." సరోజ అనునయంగా అంది.

"ఆ రోజుకోసమే జీవితాంతం వరకు ఎదురు చూసేలా ఉంది. యివన్నీ ఆలోచిస్తూ ఉంటే అన్నిబంధాలు వదలి స్వతంత్రంగా ఎక్కడికయినా పోవాలని ఉంది". రమణ బాధగా నుదుటిమీద కొట్టుకున్నాడు.

సరోజ మాట్లాడకుండా వూరుకుంది.

"అమ్మాయ్, నీళ్ళు తోరిపాను. వాణ్ణి పోసుకో మను." వరటింట్లోనుంచి కేక వినబడింది.

రమణ లేచి భార్యచేతిలో తువ్వాలు అందుకున్నాడు.

భోజనంచేస్తూ వుండగా సీతమ్మగారు అంది:

"దుర్గ మామగారు ఉత్తరం వ్రాసేడురా."

"సరోజ చెప్పింది."

ఆవిడ యింక మాట్లాడకుండా వూరుకుంది.

రమణ భోజనం చేసి కంచంలో చేయి కడిగేసుకుని లేచాడు.

"మురళి పరీక్ష ఫీజేదో కట్టాలి. ఎల్లుండి ఆఖరు రోజట. నీతో చెప్పమన్నాడు." మెల్లగా అంది సీతమ్మగారు.

"ఎంతట?" రమణ నిస్పృహగా అన్నాడు.

"ఏభయి అయిదో అరవయ్యో చెప్పాడు."

"మావెధ్యమసు! వెధవ చదువు! నేను చెప్పించలేను." రమణ కోపంగా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"అలాగంటే ఎలాగరా మరి? ఈసారిమట్టుకు ఏదో చూస్తే తరువాత సంగతి చూసుకోవచ్చు. ఏడాది చదివిన చదువు." సీతమ్మగారు వెనకాలే వస్తూ అంది.

రమణ మాట్లాడకుండా కుర్చీలో వెనక్కి వ్రాలాడు. ఒక నిముషం నిలబడిచూసి రమణ మాట్లాడకపోయేసరికి ఆవిడ లోనికి వెళ్ళిపోయింది.

"సరూ!" రమణ పిలిచాడు. "నీ దగ్గర ఏమయినా డబ్బు ఉందా?" సంకోచిస్తూ అడిగాడు.

"పాతిక రూపాయలు ఉన్నట్లున్నాయి" సరోజ లేచి తీసుకొని రావడానికి వెళ్ళబోయింది. రమణ భార్య చేయిపట్టి ఆపేశాడు.

"వద్దులే ఉంచుకో. ఏమయితే అదే అవుతుంది." రమణ మళ్ళీ అన్నాడు.

"ఫర్వాలేదు. ఫస్టువచ్చాక మళ్ళీ నా కిచ్చేద్దురు గాని." సరోజ అంది.

"ఛ! వద్దు. అది నీ డబ్బు మీవాళ్ళిచ్చింది. నా కధికారం లేదు."

సరోజ "మీ యిష్టం" అని వూరుకుంది.

రెండు నిముషాలు యిద్దరూ మౌనంగా ఉండిపోయారు.

"లక్ష్మి యేదీ? కనపడదేం?"

"ఏమో! ఎక్కడికో వెళ్ళినట్లుంది." ఎటో చూస్తూ అంది సరోజ.

వంటగదిలో గొడవ విని ఒక్క ఉదుటున లేచాడు రమణ.

వాసు యిల్లెగిరిపోయేలా యేడుస్తున్నాడల్లా టక్కున నోరు మూసేసాడు అన్నగారిని చూసి.

"ఏమిటమ్మా? ఏమిటి గొడవ?" రమణ కోపంగా అడిగాడు తల్లిని.

"ఏమీలేదు." చిరాకుగా అని వూరుకుంది ఆవిడ.

"ఏమిట్రా! ఎందుకా యేడుపు? తిన్నది అరగటం లేదనా" వాసు చెవి పట్టుకుని అన్నాడు. వాసు మాట్లాడకుండా తలదించేసాడు.

"మాట్లాడవేం?"

రమణ గర్జింపుకి ఉలికిపడ్డాడు వాసు.

"టెస్టు బుక్కు లేనిదే క్లాసుకి రావద్దన్నాడట మాష్టారు స్కూల్లో." సీతమ్మగారు అంది.

రమణ వాసుని వదిలి నీరసంగా వీధిలోకి నడిచాడు.

గుమ్మంలోనే ఎదురువచ్చాడు సీతాపతి. రమణ మామగారిని చూసి చిరునవ్వు అరువు తెచ్చుకున్నాడు ముఖం మీదికి.

"మధ్యాహ్నం వచ్చానోయ్. నువ్వులేవు. అలాగ చిన్నప్పటి స్నేహితు డొకడుంటేను చూసివద్దామని వెళ్లేను." సీతాపతి ఆయాసపడుతూ కూర్చున్నాడు.

"కాళ్ళు కడుక్కోండి. భోజనం చేసి కూర్చోవచ్చు. యిప్పటికే ఆలస్యమయిపోయింది. నేను యింతకుముందే చేసాను." రమణ కొంచెం సిగ్గుపడుతూ అన్నాడు.

"ఆ ఫర్వాలేదు. దానిదేముంది? యివాళ శనివారం కదూ. అయినా ఆ ఫలహారం యేదో మా వాడింట్లో అయిపోయిందిలే." సీతాపతి నవ్వుతూ అన్నాడు.

"అత్తగారు, అందరూ కులాసాయేనా?" రమణ అడిగాడు.

"ఆ. శ్యామలని చూడడానికి అమలాపురం వెళ్ళాను. వస్తూ దారేకదా, మిమ్మల్ని కూడా చూసినట్టుందని యిక్కడ దిగాను. నాన్నగారు యింకా రాలేదేమిటి?" సీతాపతి యిల్లంతా చూస్తూ అడిగాడు.

"ఇంకా లేదండి. ఎక్కడికో వెళ్ళారు" రమణ అన్నాడు.

"అమ్మాయ్! కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టు తల్లీ." సీతాపతి అక్కడే నిలుచున్న సరోజతో అన్నాడు. సరోజ లోనికి వెళ్ళింది.

"ఏమయినా పనుందా? అలాగ కొంచెంసేపు గారికి తిరిగివద్దా మేమిటి?" సీతాపతి అల్లుడిని అడిగాడు.

"పనేంలేదు, నడవండి." రమణ సాలోచనగా చూస్తూ చెప్పులు వేసుకున్నాడు. ఈలోగా సీతాపతి మంచినీళ్ళు త్రాగి రమణ ననుసరించాడు. చీకటి బాగా పడిందేమో వీధులలో జన సంచారం తగ్గిపోయింది. అడుగుల చప్పుడే గట్టిగా వినపడుతోంది.

"గోదావరి గట్టుకేసి వెళ్దామా?" సీతాపతి అడిగాడు.

"వూఁ" పరధ్యానంగా అన్నాడు రమణ.

"అమావాస్య రోజులుకదా! వెన్నెల అంతగా లేదు." సీతాపతి ఏదోఒకటి మాట్లాడాలి అన్నట్లుగా అన్నాడు.

రమణ మాట్లాడక వూరుకున్నాడు.

"ఇక్కడ కూర్చుందామా?" సీతాపతి యిసుకలో కూర్చున్నాడు

రమణ ఒక అడుగుదూరంలో రాయిమీద కూర్చున్నాడు. చల్లనిగాలి మెత్తగా శరీరాన్ని ఆరబెడుతోంది. రమణ అక్కడున్నాడన్నమాటే కాని మనసెక్కడో ఆలోచిస్తోంది. సీతాపతి యేవో ఉద్యోగం విషయాలు అవీ యివీ అడుగుతున్నాడు. రమణ పరధ్యానంగా జవాబులు చెప్తున్నాడు.

"యేమిటో ఆలోచిస్తున్నట్టున్నావు." సీతాపతి ముందుకి వంగి అన్నాడు.

"అబ్బే, యేమీలేదు." రమణ సర్దుకుని కూర్చున్నాడు.

"మురళికి యీయేటితో పి. యు. సి. అయిపోతుందేమో కదూ." సీతాపతి అడిగాడు.

"అవును." రమణ చేతికి అంటిన యిసుక దులిపాడు.

"మరి తరువాత యేంచేద్దాం అనుకుంటున్నారు?"

"ఏమో యింకా ఆలోచించలేదు." రమణ ఒక నిముషం ఆగి అన్నాడు.

"ఒకవేళ స్కాలర్‌షిప్ లాంటిది వచ్చినా పైకి చెప్పించడం కష్టం అనుకుంటాను."

"కష్టమే" రమణ విచారంగా అన్నాడు.

"లక్ష్మికి ఎన్నోయేడు?" సీతాపతి మళ్ళీ అడిగాడు.

"పదిహేడు నిండాయి." రమణకి మామగారి ఉద్దేశ్యం అర్థమయింది.

"వాసు యింకా సెకండ్‌ఫారమో, థర్డుఫారమో." సీతాపతి ఆగి మళ్ళీ అన్నాడు. "ఈ వూబినుంచి ఎప్పటికి బయట పడతావో అర్థం కాదు."

రమణకి కొంచెం కోపం వచ్చింది. మాట్లాడకుండా యిసుకలో గీతలు గీస్తూ కూర్చున్నాడు.

"నేనొకటి చెప్తాను వింటావా?" సీతాపతి రెండు చేతులమీద వెనక్కి ఆనుకున్నాడు.

"చెప్పండి."

"వూరికే అనడంకాదు. నిజానిజాలు జాగ్రత్తగా ఆలోచించాలి."

రమణ తలయెత్తి మామగారివంక చూసాడు.

"నువ్వు, సరోజా నాతోకూడా వచ్చేయండి." సీతాపతి అన్నాడు.

"ఏమిటి? మీరనేది?" రమణ ముఖం చిట్లించి అన్నాడు.

"అవునోయ్! ఎన్నాళ్ళిలా ఉంటావు? ఎదుగూ బొదుగూ లేకుండా. మురళికి చదువు చెప్పించాలి. లక్ష్మి పెళ్ళి! యింకా వెనకాల వాసు! వీటికి అంతు లేదేమిటి? చివరికి నీ సంగతేమిటి?"

"అయితే యేమంటారు? వాళ్ళమానానికి వదిలేసి నన్ను లేచి పొమ్మంటారా?" రమణ కోపంగా అన్నాడు.

"ఇదిగో అబ్బాయ్. ఒకటి చెప్తాను విను. సుఖం యేనాడూ నిన్ను వెదుక్కుని రాదు. నువ్వే ప్రయత్నించాలి. అయ్యో! నావారందరూ నా వెనకాల రావడంలేదే అనుకుంటే నీవూ అక్కడే వుంటావు. జీవితంలో ప్రతిక్షణం నీతి, నిజాయితీ అనుకుంటూ ఆదర్శాలను పట్టుకుని వ్రేలాడితే మిగిలదేముండదు. కడివెడు కన్నీళ్ళు తప్ప. కాస్త సావధానంగా ఆలోచించు. నీకిప్పుడు జీతం రెండు వందలు. అందులో నీకోసం, నీభార్యకోసం ఎంత ఖర్చు పెడుతున్నావు?"

"మీరు చెప్పేది నాకు నచ్చలేదు." రమణ దృఢంగా అన్నాడు

"అదికాదోయ్. నేనేం తప్పు చెప్తానా? నీవు బాగుపడితే చూద్దామనే నా ఉద్దేశ్యం. ఏదోయింత వరకు కుటుంబానికి సహాయపడ్డావు. బాగానే వుంది. అప్పో, తాకట్టో దుర్గ పెళ్ళి జరిగిపోయింది. అంతకంటే యింకెవరు చేస్తారు? ఎన్నాళ్లిలా జరుగుతుంది? నీకూ పిల్లలు పుడతారు. నీ సంసారం పెద్దదవుతుంది. అప్పుడు కూడా యిలాగే ఉంటావా యేమిటి? కొంచెం ఆలోచన ఉండాలి. ముందు చూపు కూడా ఉండాలి. అప్పుడే నాలుగు రాళ్ళు వెనకేసుకుంటావు. చివర సుఖపడ గలుగుతావు. లేదా ఏ కుటుంబానికి వూడిగం చేయడమే

అవుతుంది. అంతా అయిం తరువాత మిగిలేది నీకు ముప్ఫయి యేళ్ళకే అరవయియేళ్ళ వార్ధక్యమూ, నీ పెళ్ళాం పిల్లలకి చేతికి చిప్పా కర్రాను."

సీతాపతి ఆగి అల్లుడి ముఖంలోకి చూసాడు.

రమణ తీక్షణంగా నీటి అలలకేసి చూస్తూ కూర్చున్నాడు. సీతాపతికి ధైర్యం వచ్చింది.

"నేనేమీ మీవాళ్ళను అన్యాయంచేసి వచ్చెయ్య మనటంలేదు. కొంచెం నీసంగతి నీ పెళ్ళాం సంగతి చూసుకోమంటున్నాను. మురళి చదువింక కట్టిపెట్టు. నాకు వదిలెయ్యి. నేను ఎక్కడో ఉద్యోగం వేయిస్తాను."

"ఛ! వాడికి అప్పుడే ఉద్యోగ మేమిటి? వాడి చదువు ఆపటం నాకిష్టంలేదు." రమణ అసహనంగా అన్నాడు.

"ఏం! నీ చదువు ఆగినప్పుడు ఎవరు అడ్డు పడ్డారు?" సీతాపతి చిరాకుగా అన్నాడు.

రమణ మనసు గతంలోకి పోయింది. అవును. ఆ మాటలు అక్షరాల నిజం. తనకుమాత్రం చదువు కుందామని ఉండేదికాదూ? ఏం జరిగింది? యింటర్ మేడియేట్‌తో చదువు స్వస్తి పలికింది. కాలేజీకి మొదటివాడుగా పాసయ్యాడు. ఆ రోజు తండ్రి తనతో అన్నమాటలు మనసులో శాశ్వతంగా నిలిచిపోయాయి.

"రమణా! నూతిలో నిలుచున్నవాడు ఆకాశం కేసి చూస్తూ పైకివద్దామని ఎగిరితే మరింత మునుగుతాడు. మన పరిస్థితి కూడా అంతే ఇంత కంటే చదువు చెప్పించే తాహతు మనకిలేదు. కొంచెం నాకష్టం అర్థం చేసికో." అవి నాన్న తనతో అన్నమాటలు.

ఏం చెయ్యగలిగాడు? కోరికలు చంపుకుని తండ్రి చెప్పినట్లు ఉద్యోగంలో చేరాడు. ఆనాటి నుంచి ఒకటే బ్రతుకు. గానుగెద్దుసామ్యం. నిత్యం యేవో కొత్త సమస్యలు! ఒకటి గడిచిం దంటే మరొకటి.

రమణ గట్టిగా నిట్టూర్పు విడిచాడు.

"రమణా! నీ కుటుంబానికి నీవు సహాయం చెయ్యవలసిందే. ఎవ్వరూ కాదనలేరు. అయితే నీ భవిష్యత్తు నాశనం చేసికోకు. ఇది కలియుగం. ఎవరి సుఖం వారు వెదుక్కోకపోతే బ్రతక గలిగే రోజులు కావు. నువ్వు ఎక్కడున్నా నీ కుటుంబానికి ఏదో తగినంత పంపు. లక్ష్మి పెళ్ళికి నీ శక్తికి తోచినట్టు సహాయం చెయ్యి. వద్దనను. కాకపోతే నేను కూడా చేతనయిన సహాయం చేస్తాను. నాకు తెలిసిన సంబంధాలు బోలెడున్నాయి. చూద్దాం. అంతేకాని నువ్వు పూర్తిగా యీ విష వలయంలో యిరుక్కుని పోతానంటే...." సీతాపతి మధ్యలోనే ఆగిపోయాడు.

"సరేలెండి. ఆలోచిద్దాం." రమణ లేచి నిలుచున్నాడు.

"అలాగంటే కాదు. నాకు మాట యివ్వాలి. ప్రస్తుతం నాకు తెలిసిన కంపెనీలోనే ఖాళీ వచ్చింది. ఆలస్యంచేస్తే అది కాస్తా చేయి జారి పోతుంది. అవకాశం వచ్చినప్పుడు వినియోగపరచు కోడంలోనే వుంది మానవుడి తెలివి. యిదిగో నీ కిక్కడికంటే యింకో యేభయి రూపాయలు ఎక్కువ వస్తాయి. రేపు ప్రొద్దున్నే నాతో బయలు దేరు. యిప్పుడప్పుడే యింట్లో యేమీ చెప్ప

# అనుబంధం

సక్కరలేదు. సందర్భంవస్తే అన్నివిషయాలు అవే తెలుస్తాయి. నువ్వు నామాటకి ఒప్పుకున్నానని ఒక్కమాట చెప్పు అంతే చాలు." సీతాపతికూడా లేచి బట్టలు దులుపుకున్నాడు.

రమణ దారిలో యేమీ మాట్లాడలేదు.

యింటిముందుకి రాగానే సీతాపతి ఆగి అన్నాడు. "ఇదిగో రమణా! నాస్వార్థం అనుకోలేక నాకుమార్తె భవిష్యత్తుకోసమో నీ మంచికోరకో చెప్పాను. నీ భార్యతో కూడా ఆలోచించి నాకు చెప్పు. నువ్వు సరేనంటే ప్రొద్దున్నే బయలుదేరివెళ్దాం."

రమణ మవునంగా అడుగు లోపలికి వేసాడు.

"అబ్బాయ్! లక్ష్మి యింకా యింటికి రాలేదురా. ఒకసారి అలాగ చూసి వస్తావేమిటి?" సీతమ్మ గారు ఎదురువస్తూ అంది.

"ఏం? ఎక్కడికి వెళ్ళింది?" రమణకి కోపం వచ్చేసింది.

"అదిగో అక్కయ్య వస్తోందే." వాసు వీధి లోకి చూస్తూ అన్నాడు,

రమణని చూసి లక్ష్మి గుమ్మంలోనే ఆగి పోయింది.

"అయిందా షికారు? ఆడపిల్లని కదూ? యింత వరకూ ఎక్కడున్నావు? నీకోసం మేమిక్కడ బెంగపెట్టుకుని చావడం!" రమణ మండిపడ్డాడు.

సీతాపతి అక్కడే కూర్చుని వున్నాడు.

లక్ష్మి సిగ్గుతో భయంతో పెదవులు కదిల్చింది కాని మాట బయటికి రాలేదు.

"అదికాదురా....." సీతమ్మగారు ఏదో చెప్ప బోయి ఆగిపోయింది. లక్ష్మి తలవంచుకుని నిలబడి పోయింది.

"లోపలికి నడు. యింకా అక్కడెందుకు?" రమణ గట్టిగా అన్నాడు.

లక్ష్మి తలయెత్తకుండా లోనికి నడిచింది.

"ఛీ! పాడు సంసారం! రమణ గొణుక్కుంటూ తన గదిలోకి నడిచాడు. మనసంతా అసలే చికాకుగా అయిపోయింది. సరాసరిపోయి మంచంమీద పడుకున్నాడు. ఏవేవో ఆలోచనలు! సీతాపతి అన్న మాటలకి ప్రాధాన్యత యివ్వకుండా ఉండలేక పోతున్నాడు. మామగారు సూచించిన పద్ధతి అనుసరించడం తనకి న్యాయమేనా? కాదా? ఒకనిముషం యివన్నీ వదలిపెట్టి వెళ్ళిపోవాలనే అనిపిస్తుంది. మరు నిముషం అన్యాయమనిపిస్తుంది. ఏం చేయాలి?

అలికిడికి తలత్రిప్పి చూశాడు. సరోజ గదిలో అగరువత్తులు వెలిగించి పెట్టింది. ఒక క్షణం భార్య ముఖంలోకి చూస్తూ అన్ని ఆలోచనలు మరచిపోయాడు రమణ. సరోజ భర్త కనులలోకి క్రీగంట చూసి నవ్వింది. తొలకరి కురిసినట్లయింది. రమణ పెదవులమీదికి కూడా అనాలోచితంగా నవ్వు వచ్చింది.

"మీనాన్నగారికి ప్రక్క, అదీ చూసావా."

"వూఁ. దొడ్లో ఆరుబయట పడుకుంటా నన్నారు." సరోజ భర్తప్రక్కనే కూర్చుంది. రమణ తదేకంగా భార్య కనులలోకి చూస్తూ ఉండిపోయాడు.

"సరూ! మీ నాన్నగారు యిందాక ఒక ముఖ్యమయిన విషయం ప్రస్తావించారు."

సరోజ ముఖం గంభీరంగా మారిపోయింది. తల దించేసింది.

"మధ్యాహ్నం నాతో చెప్పారు. నేను అసలు మీతో ప్రస్తావించవద్దనే చెప్పాను. వినలేదన్న మాట." సిగ్గుతో మెల్లిగా అంది.

రమణ భార్యాముఖం తనవైపుకి త్రిప్పుకున్నాడు. "అందులో పెద్ద తప్పుయేముంది? ఏదో మన సుఖం కోసమే చెప్పారు. మన కిష్టమయితే చూద్దాం. సరేనా."

"నేనేదో యిక్కడ కష్టపడుతున్నానని మీరు అనుకోకండి. నా సుఖంకోసమని మీరేమీ నిర్ణయాలు చేయవద్దు. నా కింతకుమించి మరేమీ వద్దు." సరోజ మెల్లిగా అంది.

"నీకోసం నాకోసం కాదోయ్. పుట్టబోయే వాళ్ళకోసం." రమణ అంత గంభీరతలోను నవ్వాడు, సరోజ కూడా నవ్వింది.

"ఇంతకీ నువ్వేమంటావ్? నీ ఉద్దేశమేమిటి?" రమణ భార్య భుజాలుపట్టి తనవైపు త్రిప్పుకుని అడిగాడు.

"నాకు తెలియదు. నేనేం చెప్పలేను. మీకేది మంచిదనితోస్తే అలాగ చెయండి." సరోజ రమణ చూపులు తప్పించుకుంది.

రమణ మళ్ళీ ఆలోచనలో మునిగిపోయాడు. తనిప్పుడు వదలివేస్తే ఏం జరుగుతుంది? నాన్న, అమ్మ పెద్దవాళ్ళయి పోయారు. మురళికి యింకా గట్టిగా పందొమ్మిది యేళ్ళయినా లేవు. ఉద్యోగంచేసి కుటుంబాన్ని పోషించగలడా? లక్ష్మి పెళ్ళెలాగ జరుగుతుంది? వాసు ఇంకా పసివాడేనే!

పోనీ తను మురళిని కష్టపడి చదివిస్తే మాత్రం వాడు తనకేం చేస్తాడు? నాకేం తెలియదు? నాబ్రతుకు నాది. అంటే మాత్రం తనేమనగలడు? దుర్గ పెళ్ళికి చేసిన మూడువేల అప్పు మిగిలి పోయింది. వడ్డీ తప్ప అసలు తను తీర్చలేడు. లక్ష్మి పెళ్ళికి మళ్ళీ ఎలాగలేదన్నా అయిదువేలు అన్నా ఉండాలి. యీ అప్పులన్నీ తీర్చగలిగేసరికి తన బ్రతుకు తెల్లవారిపోతుంది. యింకా వాసుని పెద్దవాడిని చేయాలి.

రమణ మనసు ఒక క్షణం వూగిసలాడింది. తన సుఖం తనెందుకు చూసుకోకూడదు? తన సౌఖ్యం, యవ్వనం ఎందుకు ధారవోయాలి? అందరూ తనలాగే ఉంటున్నారా? క్రొత్తగా పెళ్ళయిన వాళ్ళు అనుభవించే సంతోషం తనెన్నో వంతు అనుభవించ గలుగుతున్నాడు? అందరూ భార్యలను వెంటబెట్టుకుని హాయిగా ప్రపంచం అంతా తిరిగి వస్తున్నారు. తనేం చేసాడు? సరోజను కూడా తీసికొనివచ్చి యీ నరకంలో పడేశాడు. ఆఖరికి ఒక్కొక్కరోజు తినడానికి సరిగా తిండి కూడా కరువే.

ఏనాడయినా తను సరోజను సినిమాకు కాని, ఎక్కడికయినా తీసికొని వెళ్ళ గలిగాడా? అసలు అటువంటి ఆలోచన చేయగలిగే తాహతు తనకి లేదు. ఆ డబ్బు ఖర్చు చేయకుండావుంటే రెండు రోజులు హాయిగా గడుస్తుంది. అని మనసు బుద్ధి చెప్తుంది. ఆఖరికి ఏదో ఒకటి రెండుసార్లు తప్ప సాయంకాలం రెండణాలు ఖర్చుచేసి పువ్వులు కొని తేలేక పోయేడు. యేమిటి తనకి మిగిలిందని?

తన చేతులతో సరోజకి ఒక్క చీర కొనలేదు. తనెందుకని తన సౌఖ్యం త్యాగం చేయాలి? తనకి దక్కే ప్రతిఫలం యేముంటుంది? అందరికీ చివరకి రెక్కలు వచ్చి ఎగిరిపోతారు. మిగిలేది తనొక్కడే! రెక్కలు సగం విరిగి నాశనమయిపోయి.

రమణ ముఖం నిండా చెమటలు పట్టాయి.

అలాగ జరగడానికి వీలులేదు. తనెందుకు నాశనమవాలి? తను స్వేచ్ఛగా హాయిగా జీవించాలి.

"సరూ! నిద్రపోయావా?" రమణ లేపాడు.

"వూహూ . ఏమిటి?" మత్తుగా కళ్ళు తెరువకుండానే అంది సరోజ.

"మనం యిక్కడ ఉండవద్దు. వెళ్ళిపోదాం ఎక్కడికయినా సరే." రమణ ఆవేశంగా అన్నాడు.

"ఏవి టి?" సరోజ ఆశ్చర్యంగా అంది నిద్ర మత్తు వదలిపోయి.

"ఈ బాధ్యతలన్నీ మనకి వద్దు. ఈ బరువు నేను మోయలేను. బట్టలు సర్దుకో. తెల్లవారి మీనాన్నగారితో వెళ్ళిపోదాం." రమణ భార్యను లేపి కూర్చోబెట్టాడు.

"తొందరపడి నిర్ణయాలు చేయకండి." సరోజ భర్తకేసి అనుమానంగా చూస్తూ అంది.

"లేదుసరూ! అన్నీ ఆలోచించే యీ నిశ్చయానికి వచ్చాను." రమణ లేచి నిలుచున్నాడు.

"నాబట్టలు, నీవి ఒకే పెట్టెలో సర్దెయ్యి. వూరికి వెళ్తున్నామని చెప్దాం. అక్కడికి వెళ్ళిన తరువాత వివరంగా ఉత్తరం వ్రాయవచ్చు."

సరోజ మాట్లాడకుండా కూర్చుంది.

"మనం యిక్కడ ఉండలేం సరూ! నేను పూర్తిగా ఆలోచించాను లే మరి!" రమణ భార్యను బలవంతంగా ట్రంకు ముందు కూర్చోబెట్టి తన షర్టులు అవీ ముందు పడేసాడు.

సరోజ పెట్టెలో బట్టలు చేతులతో కదుపుతూ వూరుకుంది.

"నామాటమీద నమ్మకం లేదేమిటి?" రమణ అన్నాడు.

సరోజ ఒకసారి తలయెత్తిచూసి మెల్లిగా బట్టలు సర్దటం మొదలు పెట్టింది.

రమణ అటూ యిటూ తిరుగుతున్నవాడల్లా ఆగిపోయి భార్య ప్రక్కనే కూర్చున్నాడు. "నీకు ఇప్పుడు నిజంగా సంతోషంగా లేదూ?" భార్య గడ్డంపట్టి తనవైపుకు త్రిప్పుకుని అడిగాడు.

సరోజ నవ్వింది. "మీకు సంతోషంగావుంటే నాకూ ఉంటుంది." పెట్టె మూసేస్తూ అంది.

చాలు! సరోజ ముఖంలో తృప్తిచాలు. తను చేసే పనిలో సరోజకి సుఖం ఉంది. రమణ మనసులో సమర్థించుకున్నాడు.

"రేపేనా వెళ్ళిపోవడం?" సరోజ ప్రక్క మీద పడుకుంటూ సంశయంగా అడిగింది.

"వూఁ." రమణ సంతృప్తిగా చూస్తూ పడక కుర్చీలో కూర్చున్నాడు.

"సరే అయితే లైటు ఆర్పేయండి. నాకు నిద్రవస్తోంది బాబూ." సరోజ ఆవులిస్తూ అంది.

"హాయిగా నిద్రపో. యింక పీడ కలలు లేవు. జీవితమంతా పువ్వులబాట!" రమణ లేచి లైటు ఆర్పేశాడు.

రమణ అలాగేకూర్చున్నాడు చీకటిలోకిచూస్తూ. అరగంట గడచి పోయింది. భవిష్యత్తుకి ఆలోచనలతో ఒక రూపం యివ్వడానికి ప్రయత్నిస్తున్నాడు. తనకి, సరోజకి అయితే తనకివచ్చే జీతం హాయిగా సరిపోతుంది. రమణ స్వప్నలోకాలలోకి తేలిపోయాడు. అకస్మాత్తుగా గుర్తుకి వచ్చింది.

తన నిర్ణయం అమ్మా నాన్నకి తెలిసి యేమను కుంటారు? మోసం చేశాడు అనుకుంటారా? ఇందులో నిజంగా తన తప్పేముంది! తనకిమాత్రం కోరిక అనేది ఉండవూ!

మురళి యేమని అనుకుంటాడు? అన్నయ్య తనని నాశనం చేశాడని అనుకుంటాడేమో! వాడు కూడా చివరకి గుమాస్తా అయిపోతాడా? లక్ష్మి పెళ్ళి యెలాగ జరుగుతుంది? చివరకి డబ్బులేక రెండోపెళ్ళివాడికిచ్చి చేస్తారా? లేకపోతే దాన్ని కూడా పోషించలేని దరిద్రుడి చేతిలో పెట్టరు కదా! వాసు చదువు మానేసి కోమటి కొట్లో చేరతాడేమో! పేపర్లు అమ్ముకోవలసి వస్తుందేమో!

రమణ తల వేడెక్కిపోయింది. ఛీ! తను యింత బలహీనుడయి పోతున్నాడేం? తనేం చేయాలి? తను తప్పటడుగు వేయటం లేదుకదా!

రమణ లేచి చీకటిలోనే అటూ యిటూ తిరగడం ప్రారంభించాడు. గాఢ నిశ్శబ్దంలో సరోజ ఉచ్ఛ్వాస నిశ్వాసాలు గట్టిగా వినపడుతున్నాయి.


రమణకి నోరు యెండిపోయి దాహం వేసింది.

"సరూ!" మెల్లిగా పిలిచాడు.

సరోజ ప్రక్కకి తిరిగింది నిద్రలోనే. రమణ మెల్లిగా తలుపుతీసి బయటకు వచ్చాడు. గడియారం పదకొండు గంటలు కొట్టింది. అంతా నిశ్శబ్దంగా ఉంది. ప్రక్కగదిలో లైటు వెలుగుతోంది.

చప్పుడు చేయకుండా వంటగదిలో అడుగు పెట్టాడు.

"ఎవరు? నాన్నా! రమణా నువ్వేనా? యింకా పడుకోలేదూ? మళ్ళీ ప్రొద్దునే ఆఫీసుకి వెళ్ళాలి కదా! పెందరాళే పడుకో గూడదూ?"




రమణ తల్లి కంఠస్వరంలోని ఆప్యాయతకి చలించిపోయాడు. ఒక్క క్షణం తల్లి "నాన్నా! రమణా" అని పిలిస్తే ఎంతహాయిగా ఉంది. రమణ సర్వం మరచిపోయాడు. తను యీ ప్రేమాప్యాయతలు దూరం చేసికోవాలా?

లైటు వేసాడు. వట్టి క్రిందనే పడుకుంది కాబోలు ఆవిడ, యిక ప్రక్క బట్టలేమీ లేవు.

"క్రింద పడుకున్నా వేమిటమ్మా?" రమణ బాధగా అన్నాడు.

"కడిగిన నేలకదరా." కొడుకు చూపిన ప్రేమకి వాత్సల్యంతో అంది సీతమ్మగారు.

అబద్ధం! మిగిలిన ప్రక్క బట్టలన్నీ తన మామగారికి వేసి ఉంటారు. రమణ మనసులోనే అనుకున్నాడు.

"మంచినీళ్ళు కావాలమ్మా" రమణకి తల్లి ముందు తనెంతో చిన్నవాడయిపోయినట్లు అనిపించింది.

ఆవిడ లేచి గ్లాసుతో నీళ్ళు అందిచ్చింది. రమణ గ్లాసు అందుకోబోయాడు.

"ఉండు. నలకలేవో ఉన్నట్టున్నాయి. మళ్ళీ యిస్తాను." సీతమ్మగారు రమణ చేతిలోని గ్లాసు నీళ్ళు పారపోసేసింది.

రమణ విభ్రాంతుడయిపోయాడు.

అయ్యో! యిటువంటి ప్రేమమయినా తను దూరం చేసికోవాలని అనుకున్నది. రమణకి ఒక్కసారిగా నీరసం ఆవరించింది. అక్కడే కూర్చుండి పోయాడు. కనులలో నీరు తిరిగింది.

"ఏమిటినాన్నా! ఏం జరిగింది?" సీతమ్మగారు కంగారు పడింది.

అక్షణాన రమణకి తల్లి ఒడిలో తలదాచుకుని తన పాపిష్ఠి ఆలోచనలన్నీ చెప్పి క్షమాపణ కోలరుకోవాలని అనిపించింది మనసులో.

"తలనొప్పిగా ఉంది. అమ్మా" చివరకి మెల్లిగా అన్నాడు

"మరి చెప్పావుకావేం. ఉండు. అమృతాంజనం వ్రాస్తే తగ్గిపోతుంది." ఆవిడ ప్రక్క గదిలోకి వెళ్ళింది.

రమణ నీళ్ళు నిండిన కళ్ళతో నీరసంగా కూర్చుండి పోయాడు.

తల్లి చేతివ్రేళ్ళ స్పర్శలోని సుఖం అనుభవిస్తూ మత్తుగా కళ్ళు మూసుకుని పడుకున్నాడు రమణ చాలసేపు.

"అమ్మా! నాన్న పడుకున్నారా?"

"లేదురా. మురళికి కాలేజీకి డబ్బు కావాలి కదూ. ఎక్కడయినా చూస్తానని వెళ్ళారు. ఏదీ యింకా రాలేదు."

"నేనేదో ఎక్కడో చూసేవాడినిగా. ఆయన కెందుకు చెప్పావు? అర్ధరాత్రి ఎక్కడ ఎవరింటికి తిరుగు తున్నారో యేమో!" రమణ మనసు పూర్తిగా మారిపోయింది.

"ఎంతకని నువ్వుమాత్రం బాధపడతావురా?" సీతమ్మగారు జాలిగా అంది.

"యింక చాలమ్మా. తగ్గిపోయింది." రమణ లేచి కూర్చున్నాడు.

"లక్ష్మిని హింది పరీక్షలకి కట్టమని నేనే అన్నారా వూరికేనే కూర్చోవద్దని. ఆ స్కూలు

# ఐటెక్స్

అలంకరణ సామగ్రి

* ఐటెక్స్ కాటుక
* ఐటెక్స్ బిందీ
* ఐటెక్స్ కుంకుం పేస్ట్




: తయారు చేయువారు :

అరవింద్ లేబరేటరీస్

పోస్టు బాక్సు నెం. 1415, మద్రాసు-17.






సంక్రాంతి అభినందనలు!

వివాహాది శుభ కార్యములకు, పండుగ పర్వదినములకు, మావద్ద

● కాంచీపురం ● బెనారస్ ● ధర్మవరం

పట్టు చీరలు మరియు చోళీ పీసులు

సరసమైన ధరలకు లభించును.

దక్షిణ ఇండియాలో సరికొత్త డిజైనులకు పేరు పొందినది.

నల్లి చిన్నస్వామి చెట్టి

పనగల్ పార్కు ఎదురుగా

టి. నగర్ (ఫోను: 41115) మద్రాసు-17


## అనుబంధం

సాయంకాలం అయిదింటికి కాని మొదలు పెట్టరుట. అందుకని ఆలస్యమయిందిట. నువ్వు తింటావని భోజనం చేయకుండా పడుకుంది. పిచ్చిది!" సీతమ్మగారు అంది.

"వానసవాళ చికాకుగా ఉంది యేదో ఆనే సాను." రమణ గొణుక్కున్నాడు.

"నువ్వింక పడుకో అమ్మా!" రమణ లైటు ఆర్పి బయటికి వచ్చేసాడు.

ప్రక్కగదిలోకి తొంగి చూశాడు. మురళి గుమ్మంకేసి వీపు ఉంచి ముందుకివంగి చదువు తున్నాడు. లక్ష్మి మరొక కుర్చీ మీద కుర్చుంది. చేతులు బల్లమీదఉంచి, తల ఆన్చి నిద్రపోతోంది. రమణ మనసు జాలితో నిండిపోయింది. అందరి ఎదురుగా అభిమానం ఉన్న పిల్లని తిట్టడం తన తప్పు.

రమణ నిశ్శబ్దంగా యిద్దరి వెనుక నిలబడ్డాడు.

తలమీద మెత్తటి రమణ చేతి స్పర్శకు ఉలిక్కి పడి లేచింది లక్ష్మి.

మురళి ఆశ్చర్యంగా చూసాడు.

"లక్ష్మీ! అన్నం తినలేదుటగా యింకా. అన్నయ్య తిడితే ఎవరయినా కోపగించు కుంటారా? ఒంటరిగా రేపటినుంచి వెళ్లకు. వాసుని కూడా సాయం తీసి కొని వెళ్తూవుండు. యేం సరేనా? ముందు భోజనం చేసిరా!" అనునయంగా అన్నాడు రమణ.

లక్ష్మి మాట్లాడకుండా తలవంచుకుంది.

"యింకా కోపం పోలేదా నామీద?" రమణ చెల్లెలి చెక్కిళ్లమీద ఎండిన కన్నీటి చారికలు చేతితో తుడిచేశాడు.

"నా కెందుకు కోపం?" ఈసారి లక్ష్మి తెల్లని పలువరస కనబడేలా నవ్వింది.

"మరి వెళ్ళు. ముందు భోజనం చేసిరా. వెళ్లే టప్పుడు నా గదిలో దిండువుంది అమ్మకి తీసికొని వెళ్ళియ్యి." రమణ చెల్లెలిని పంపేశాడు.

"ఏరా! మురళీ! బాగా చదువు తున్నావా?" ముందున్న పుస్తకం పేజీలు తిరగేస్తూ అడిగాడు.

"బాగానే చదువుతున్నా నన్నాయ్. వదిన ఆలస్యంగా చెప్పింది. నేను సైకిలు తీసికొని వెళ్లే సరికి కొట్లు కట్టేసారు." మురళి అన్నాడు.

"పోనీలేరా. స్కాలరుషిప్ రావాలి మరి. జాగ్రత్తగా చదువు." ప్రేమగా వీపుమీద తట్టి వచ్చేశాడు.

పూర్తిగా తెల్లవారకుండానే సరోజ, రమణని నిద్ర లేపింది.

"నాన్నగారు మిమ్మల్ని త్వరగా తయారు కమ్మంటున్నారు. నాస్నానం కూడా అయిపోయింది. బండికి ఆట్టే టయిములేదట."

రమణ బద్ధకంగా ప్రక్కకి తిరిగి పడుకున్నాడు. "అబ్బ! రాత్రి సరిగా నిద్రపట్టలేదు సరూ! యిప్పుడే లేవను. మురళి లేస్తే నా సైకిలు ముందు బాగు చేయించుకుని రమ్మనిపంపు."

సరోజ ఆశ్చర్యపోయి చూసింది. "అయితే మీరు నిజంగా......" మధ్యలోనే వాక్యం పూర్తి చేయకుండా ఆగిపోయింది.

"పీడకల వచ్చింది." రమణ తృప్తిగా నవ్వి మళ్లీ కళ్లు మూసుకున్నాడు. ●